నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు ఎంజీయూ ఒప్పందం

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 15 : సాంకేతిక, కంప్యూటర్ రంగంలో విద్యార్థుల్లో నైపుణ్య అభివృద్ధికి కృషి చేస్తున్న ఎడ్యు నెట్ సంస్థతో గురువారం ఎంజీయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూనివర్సిటీ ఉపకులపతి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీయూలో గురువారం జరిగిన ఒప్పంద కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతో కలిసి విధివిధానాలు ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఒప్పంద పత్రాలను పరస్పరం పంచుకున్నారు. సాంకేతిక, కంప్యూటర్ రంగంలో విద్యార్థుల్లో నైపుణ్య అభివృద్ధికి కృషి చేస్తున్న ఎడ్యు నెట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషకరమన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయబోయే 16 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఎంజీయూ ఒకటిగా నిలువనుందని పేర్కొన్నారు. ఈ సెంటర్ ఏర్పాటుతో అధునాతన సదుపాయాలతో కూడిన కంప్యూటర్ ల్యాబ్ ద్వారా ఎంసీఏ, ఇంజినీరింగ్ సీఎస్ఈ విద్యార్థులకు అత్యాధునిక సాఫ్, మెషిన్ లెర్నింగ్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆల్వాల రవి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వై.ప్రశాంతి, మిరియాల రమేశ్, రేఖ, జయంతి, సుధ, సంధ్య, మానస, దుర్గాప్రసాద్, సంస్థ ప్రతినిధులు రవీందర్‌సింగ్, వాహెద్ షేక్, టాస్క్ ప్రతినిధి ప్రదీప్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

అప్లికేషన్ల ఆన్‌లైన్ పైసలియ్యలే..

- ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ చార్జీల కోసం ఆపరేటర్ల ఎదురుచూపులు
- సూర్యాపేట జిల్లాలో 1,350 మందికి రూ.32లక్షలకు పైనే బకాయి నెల రోజులవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

సూర్యాపేటలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు (ఫైల్)

సూర్యాపేట, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంతో ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం కనిపించకపోయినా.. కనీసం దరఖాస్తుల డాటా ఎంట్రీకి సంబంధించిన డబ్బులు కూడా ఇవ్వలేదు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 475 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో 3,62,203 దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో ఆరు రోజుల వ్యవధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు ప్రైవేట్ ఆపరేటర్లను అంతా కలిపి సుమారు 1,350 మందితో రేయింబవళ్లు పని చేయించారు. ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్ చేసినందుకుగాను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7, ప్రైవేట్ ఆపరేటర్లకు రూ.15 చొప్పున ఇవ్వాల్సి ఉండగా.. దాదాపు రూ.32 లక్షల బకాయి ఉన్నట్లు తెలిసింది. నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఆ డబ్బులు విడుదల చేయకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు.

రాష్ట్రంలోని దాదాపు అన్ని కుటుంబాలు, వారి ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన పూర్తి వివరాలను కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ద్వారా సేకరించింది. దాని ద్వారానే దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను నాటి ప్రభుత్వం చేపట్టింది. అయితే గత ఎన్నికల్లో గెలిచి కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసిన విషయం విదితమే. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసేందుకు కుటుంబాల వివరాలు ఉన్నప్పటికీ కాలయాపన కోసం ప్రజాపాలన అంటూ కార్యక్రమం చేపట్టి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా పరిధిలోని 23 మండలాలు, 475 గ్రామపంచాయతీలు, 5 మున్సిపాలిటీల నుంచి 3,62,203 దరఖాస్తులను స్వీకరించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ జనం నుంచి తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించారు. కానీ.. వారికి చెల్లించాల్సిన దాదాపు 32 లక్షల రూపాయలు ఇప్పటికీ ఇవ్వలేదు.

నెల నుంచి ఎదురుచూపులే..

ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినందుకు గాను ప్రతి దరఖాస్తుకు ప్రైవేట్ వారితో చేయిస్తే రూ.15, ప్రభుత్వంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో చేసే ఆపరేటర్లకు రూ.7 చొప్పున ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ.. దరఖాస్తుల ఆన్‌లైన్ ముగిసి నెల కావస్తున్నా ఆపరేటర్లకు ఇవ్వాల్సిన డబ్బు మాత్రం చెల్లించలేదు. ఆరు రోజుల్లోనే జిల్లాలోని దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ చేయడంతో రాష్ట్రంలోనే రికార్డు నమోదైంది. 1,350 మంది ఆపరేటర్లు పని చేయగా వారిలో కొద్దిమంది మాత్రమే ప్రైవేట్ వారు ఉన్నట్లు తెలిసింది. మిగిలిన వారంతా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. డే వన్ నుంచి మూడు షిఫ్టుల్లో రేయింబవళ్లు ఆన్‌లైన్ చేయగా వారికి సుమారు రూ.32లక్షలు రావాల్సి ఉన్నది. గత నెల 11న ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాగా, దాదాపు నెల రోజులు కావస్తున్నప్పటికి ఉరుకులు, పరుగులపై పనిచేయించిన అధికారులు ఆపరేటర్లకు ఇవ్వాల్సిన డబ్బులపై స్పందించడం లేదు. ఇదిలా ఉంటే ప్రజాపాలన కార్యక్రమం కోసం తీసిన జీఓ ప్రకారం గ్రామ పంచాయతీకి రూ.10వేలతోపాటు స్పెషల్ ఆఫీసర్లకు వాహన అలవెన్సులు ఇస్తామన్నారు. పంచాయతీలకు రూ.10 వేలు ఇవ్వగా.. టెంట్లు, భోజనాలు, మైక్‌సెట్ తదితరాలకు రూ.25వేల వరకు అయ్యాయి. విధిలేని పరిస్థితుల్లో సర్పంచులు, కింది స్థాయి అధికారులు వాటిని భరించారు. వాహనాల అలవెన్స్‌లు, పంచాయతీల్లో దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా అయిన వ్యయం ఏమో కానీ తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


పాతగుట్ట ఆలయంలో అధ్యయనోత్సవాలలో భాగంగా ముస్తాబైన ఆళ్వారులు

పాతగుట్టలో అధ్యయనోత్సవాలకు శ్రీకారం

- తిరుమంజనం, తొళక్కంతో ఉత్సవాలకు అంకురార్పణ
- మూడు రోజులపాటు జరుగనున్న వేడుకలు
- ప్రధానాలయంలో నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి అనుబంధంగా ఉన్న పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు జరిగే అధ్యయనోత్సవాలకు గురువారం అంగరంగ వైభవంగా, పాంచరాత్రాగమశాస్త్రం ప్రకారం ప్రధానార్చక బృందం శ్రీకారం చుట్టింది. ప్రత్యేక సేవపై స్వామి, అమ్మవార్లతో ఆళ్వార్ స్వాములను అలంకరించారు. ఆలయంలో నిత్య ఆరాధనల అనంతరం తిరుమంజన మహోత్సవాన్ని పాంచరాత్రాగమ సాంప్రదాయ రీతిలో ప్రధానార్చకులు, అర్చకులు, పారాయణికులు, వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తొళక్కంతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయం మండపంలో సేవకు అర్చకులు, పారాయణికులు, రుత్వికులు వేద పారాయణాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ఉప, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తిరుమంజన మహోత్సవం ప్రత్యేకత

అధ్యయనోత్సవాల్లో భాగంగా శ్రీవారి ఆలయంలో మూలవర్యులకు ఆగమశాస్త్రానుసారంగా తిరుమంజన మహోత్సవం నిర్వహిస్తారు. భగవత్ రామానుజులవారు ఈ వేడుకలను నిర్వహించడంలోని ప్రత్యేకతను సూచిస్తూ భగవానుడి భక్త పరాయణతను ఆర్తత్రాణ రక్షణను పలు విధాలుగా ప్రస్తుతిస్తారు. తిరుమంజన మహోత్సవంలో ఆళ్వారులకు, భగవానుడికి ఉత్సవ మూలవర్యులకు స్నపనం నిర్వహిస్తారు. ఈ వేడుక స్వామివారికి పరమ ప్రీతికరమైనది అని దివ్యదేశ కవైభవ ప్రకాశికలో పేర్కొన్నారు.

యాదగిరిగుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాల పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. ప్రధానాలయంలో సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళ స్వామివారికి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.20,88,675 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

నేడు రథసప్తమి వేడుక

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు రథసప్తమి వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 6:40 గంటలకు స్వామివారిని సూర్యప్రభ వాహనంపై వేంచేపు చేసి తిరు మాఢవీధుల్లో ఊరేగించనున్నారు. సాయంత్రం 7గంటలకు స్వామివారిని బంగారు రథంపై ఊరేగిస్తారు.


తొళక్కంతో అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుడుతున్న ఆలయ ప్రధానార్చక బృందం

చేనేత కార్మికులు బెడ్‌షీట్ల తయారీపై దృష్టి సారించాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

పద్మానగర్‌లో పవర్‌లూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

నీలగిరి, ఫిబ్రవరి 15 : పంచెలు, లుంగీలతోపాటు బెడ్‌షీట్ల తయారీపైనా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మరమగ్గం నేత కార్మికులకు సూచించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పద్మానగర్‌లో పవర్‌లూమ్ యూనిట్లను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నేత ఉత్పత్తిదారులతో మాట్లాడుతూ పవర్‌లూమ్ మిషన్లు, డయింగ్, మార్కెటింగ్, రా మెటీరియల్, అమ్మకాలు, గిరాకీ, లాభాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మరమగ్గాల ద్వారా నేత ఉత్పత్తులు చేస్తున్న నేత కార్మికులందరూ బెడ్‌షీట్ల తయారీపై దృష్టి సారించాలన్నారు. వాటిని హాస్పిటళ్లు, ఇతర ప్రదేశాల్లో ఎక్కువగా వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నందున మంచి మార్కెటింగ్ ఉంటుందని తెలిపారు. కాటన్‌తోపాటు సిల్క్ ఉత్పత్తులపై దృష్టి సారించాలని సూచించారు. పవర్‌లూమ్స్ ద్వారా మరిన్ని ఉత్పత్తులు చేపట్టి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అమె వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, చేనేత శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రంజిత్‌కుమార్, నేత సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

నెలాఖరు నాటికి సీఎంఆర్ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అధికారులు, మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌భ

నీలగిరి, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ ఆదేశాల మేరకు రైస్ మిల్లర్లు 2022-23 యాసంగి కస్టం మిల్లింగ్ రైస్ లక్ష్యాన్ని ఈ నెల 29నాటికి నూరు శాతం పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో సీఎంఆర్‌పై పౌరసరఫరాలు, ఎఫ్‌సీఐ అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఎంఆర్ పూర్తి చేయడానికి ఈ నెల 29 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. రైస్ మిల్లర్లు మిల్లు వారీగా కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లకు కేటాయించిన బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని సైతం పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ నరసింహ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ నల్లగొండ అధ్యక్షుడు నారాయణ, మిర్యాలగూడ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెర్వుగట్టు జాతరను విజయవంతం చేయాలి

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ రవి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 15 : చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీఓ రవి సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవాలయ ఈఓ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మంచినీరు, మరుగుదొడ్ల వసతులు కల్పించాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్న మంత్రి కోమటిరెడ్డి

చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం ఉదయం 9గంటలకు గణపతి పూజతో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభిస్తారని ఆలయ ఈఓ నవీన్ తెలిపారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

ఇంటి నుంచే కొలువు కొట్టింది

- సర్కారు కొలువు పొందిన గిరిజన బిడ్డ
- గురుకుల హిందీ పీజీటీ సాధించిన కొర్ర చందన
- పలువురికి ఆదర్శంగా నిలిచిన నిరుపేద గృహిణి

నియామక పత్రం అందుకుంటున్న చందన

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : ఆమెది మారుమూల తండా. గిరిజన తెగకు చెందిన నిరుపేద మహిళ. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. కూలి చేసుకుంటే తప్ప పూటగడవని వైనం. అయినా పట్టువిడువకుండా పుస్తకాల పురుగుగా మారింది. ఓ గమ్యాన్ని నిర్దేంచుకుని చదివితే ఏదీ అడ్డుకాదని నిరూపించింది. గురుకులాల్లో హిందీ పీజీటీ పోస్టు సాధించింది. గురువారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకుంది.

సంస్థాన్‌నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామ పరిధిలోని కొర్రతండాకు చెందిన కొర్ర మోతియా, అంబాలి దంపతుల కుమార్తె కొర్ర చందన. గిరిజన కుటుంబలో పుట్టిన చందనకు చిన్నప్పటి నుంచే చదువుపై మక్కువ. టీచర్‌గా స్థిరపడాలనే టార్గెట్ పెట్టుకుంది. గట్టుప్పల మండలంలోని హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివింది. హైస్కూల్‌లో ఉన్నప్పటి నుంచే హిందీపై పట్టు సాధించింది. ఆ తర్వాత ఆర్థికంగా లేకపోయినప్పటికీ ఇంటి నుంచే చదువుకుంటూ రెండు డిగ్రీలు, ఓ పీజీ పూర్తి చేసింది. ఆ తర్వాత ఎలాగైనా టీచర్ ఉద్యోగం సాధించాలని బీఈడీ చేసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ సర్కారు హయాంలో టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ వేయడంతో దరఖాస్తు చేసి.. పరీక్ష రాసింది. తాజా ఫలితాల్లో హిందీ టీచర్‌గా ఉద్యోగం పొందింది.

ప్రణాళికా ప్రకారం చదువుపై ఫోకస్..

చందన చిన్నప్పటి నుంచే ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకుంది. ఆమెకు పదో తరగతిలోనే తల్లిదండ్రులు పెళ్లి చేశారు. అయినప్పటికీ వెనక్కి తిరిగి చూడకుండా ఓ ప్రణాళిక ప్రకారం చదువుపై ఫోకస్ పెట్టింది. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు ప్రైవేట్ ఉద్యోగం చేసింది. చందన ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా సొంతంగా చదువుకుంది. ఎప్పటికప్పుడు నోట్స్ తయారు చేసుకుంటూ ముందుకెళ్లింది. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని కష్టపడి చదివి ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది.

స్వామివారిని దర్శించుకున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు

జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతికి స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు రాజన్‌బాబు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి శాయని గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు స్వామివారి ఆశీర్వచనం చేయగా ఆలయ పర్యవేక్షకులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడమంటే మన హక్కులను వదులుకోవడమే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

నీలగిరి, ఫిబ్రవరి 15 : రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు హుందాతనాన్ని మరిచి అసెంబ్లీని రచ్చబండలా, పిట్టల సభగా మార్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా వ్యక్తిగత దూషణలు చేస్తూ సమయం వృథా చేస్తున్నారన్నారు. కృష్ణా జలాలను కేంద్రానికి అప్పగించడమంటే మన హక్కులను వదులుకోవడమేనని, దానిపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశాన్ని కార్పొరేట్ వర్గాలకు అప్పజెప్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ నేడు జరిగే గ్రామీణ సడక్ భారత్ బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల్లో పూర్తిగా అన్యాయం చేస్తున్నారని, 2015లో శంకుస్థాపన చేసిన చర్లగూడెం రిజర్వాయర్ భూ నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం కూడా ఇవ్వలేదని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేశ్, నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, పాలడుగు ప్రభావతి, కందాల ప్రమీల, లక్ష్మీనారాయణ, సత్తయ్య పాల్గొన్నారు.

నందికొండ : మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానంలో చేతులు ఎత్తి ఓటింగ్‌లో పాల్గొన్న కౌన్సిలర్లు

నందికొండ మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 15 : నందికొండ మున్సిపాలిటీలో గురువారం కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ కర్ణ అనూష, వైస్ చైర్మన్ మంద రఘువీర్ పదవిని కోల్పోయారు. మున్సిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా.. ముగ్గురు కాంగ్రెస్, 9మంది బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు. అందులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఒకరు మృతి చెందగా, ప్రస్తుతం 11 మంది సభ్యులు ఉన్నారు. కాగా, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను తొలగించాలని కోరుతూ కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు ఇవ్వగా.. మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య సమక్షంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు.

సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ హాజరు కాలేదు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు.

మేళ్ల చెర్వు జాతరకు నిధులు మంజూరు

మేళ్లచెర్వులోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8 నుంచి 12 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. జాతరకు భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసేందుకు రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు చేయించారు. ఈ విషయాన్ని హుజూర్‌నగర్ క్యాంప్ కార్యాలయం అధికారులు గురువారం వెల్లడించారు.